మారుతున్న రూపురేఖలు..!

- వేగంగా ఫ్లైఓవర్ పనులు
- వాహనదారులకు తప్పనున్న అవస్థలు
- మరో రెండు నెలల్లో అందుబాటులోకి నిర్మాణం




అచ్చంపేట జంక్షన్ వద్ద జరుగుతున్న వంతెన నిర్మాణ పనులు

కాకినాడ రూరల్: పట్టణంలో ఉన్న పోర్టులకు మెరుగైన రవాణా సదుపాయం కల్పించేందుకు రహదారి విస్తరణ పనులు చేపడుతున్నారు. అందులో భాగంగా ఏడీబీ రోడ్డులో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ వంతెనతో అచ్చంపేట జంక్షన్ రూపురేఖలు మారుతున్నాయి. పిఠాపురం- కాకినాడ మధ్య రాకపోకలు సాగించే వాహనదారులకు అచ్చంపేట జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతుండటంతో మరో రెండు నెలల్లో కూడలిలో ట్రాఫిక్ సమస్యలు కొలిక్కి రానున్నాయి. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా గతిశక్తి పథకం కింద కేంద్ర ప్రభుత్వం చొరవతో గత వైఎస్సార్ సీపీ హయాంలో నాలుగు రోడ్ల విస్తరణకు బీజం పడింది. ఏడీబీ రోడ్లు రాక్ సిరామిక్ నుంచి యాంకరేజ్ పోర్టు వరకు రూ.557 కోట్ల నిధులతో రెండు ప్యాకేజీల్లో పనులు 2023లో ప్రారంభమయ్యాయి. రాక్ సిరామిక్ నుంచి అచ్చంపేట జంక్షన్ వద్ద గోకుల్ గార్డెన్ వరకు 12.2 కిలోమీటర్ల మేర రూ.408 కోట్లతో ఒక ప్యాకేజీ, గోకుల్ గార్డెన్ నుంచి లైట్ హౌస్ మీదుగా యాంకరేజ్ పోర్టు వరకు రూ.149 కోట్లతో మరో ప్యాకేజీగా పనులు ప్రారంభించారు.

నిత్యం రద్దీగా ఉండే..

ఏడీబీ రోడ్డులో రాక్ సిరామిక్ నుంచి సామర్లకోటకు బైపాస్ మార్గంగా కెనాల్ రోడ్డు మీదుగా ముత్యాలమ్మ గుడి పక్క నుంచి నాలుగు లైన్ల రోడ్ల నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే అచ్చంపేట జంక్షన్ కూడలి వద్ద పిఠాపురం- కాకినాడ మార్గంలో రాకపోకలు సాగించే వాహన దారులకు ఇబ్బంది లేకుండా ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టారు. యాంకరేజ్ పోర్టుతో పాటు డీప్ వాటరు పోర్టుకు ఏడీబీ రోడ్డు మీదుగా రాజమహేంద్రవరం వైపు నుంచి వచ్చే వాహనాలు ఫ్లైఓవర్ వంతెనపై నుంచి రాకపోకలు సాగించనున్నాయి. కాకినాడ- పిఠాపురం మార్గంలోని వాహనాలు ఫ్లైఓవర్ కింద నుంచి రాకపోకలు సాగించనున్నాయి. అచ్చంపేట జంక్షన్‌లో కుడా సర్కిల్ వద్ద నాలుగు రోడ్ల నుంచి వచ్చే వాహనాలతో ట్రాఫిక్ సమస్యలు తరచూ తలెత్తడంతో వాహనదారులు ఇబ్బందులు పడేవారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు శ్రమించాల్సి వచ్చేది. వంతెన నిర్మాణంతో కాకినాడ రూరల్, సిటీ ప్రజలతోపాటు, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు అచ్చంపేట జంక్షన్ మీదుగా రాకపోకలు సాగించేవారికి అవస్థలు తప్పనున్నాయి.



కాకినాడ- పిఠాపురం మార్గంలోని ఏడీబీ రోడ్డులో నిర్మిస్తున్న ఫ్లైఓవర్

త్వరితగతిన పనులు పూర్తి

> ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్ నుంచి అచ్చంపేట జంక్షన్ గోకుల్ గార్డెన్ వరకు నాలుగు లైన్ల రహదారి విస్తరణ పనులు చాలా వరకు పూర్తయ్యాయి. డిసెంబరు నాటికి నాలుగు లైన్ల రోడ్డు పనులు పూర్తవుతాయని అంచనా వేస్తున్నాం. ముఖ్యంగా ఎక్కువగా ట్రాఫిక్ రద్దీ ఉండే అచ్చంపేట జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు రాత్రి, పగలు శ్రమించి నిర్మిస్తున్నాం. వర్షాలు అడ్డంకిగా ఉన్నా పనులు ఆపట్లేదు. ప్రస్తుతం వంతెన నిర్మాణం పూర్తయింది. వంతెనపై రోడ్డు, దానికి కనెక్టివిటీ పనులు జరుగుతున్నాయి. రెండు నెలల్లో పనులు పూర్తవుతాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ రైల్వే వికాస్ నిగామ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్ఎల్) పర్యవేక్షణలో ఈ పనులు చేపడుతున్నాం.
>
> – రామకృష్ణ, సైట్ మేనేజర్, ఆర్‌వీఎన్ఎల్ సంస్థ.

స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ

కాకినాడ సిటీ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ పోలీస్ మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను జేసీ రాహుల్ మీనా, డీఆర్వో వెంకటరావు, పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించారు. అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని జేసీ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రగతిని ప్రతిబింబించేలా వివిధ శాఖల శకటాలు, స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ పరిశీలనలో బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసు, కాకినాడ అర్బన్ తహసీల్దార్ జితేంద్ర, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): పట్టణంలోని గాంధీనగర్‌లో మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి, అగస్త్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 78 మీటర్ల జాతీయ జెండాతో భారతమాతకీ జై, వందే మాతరం అంటూ విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం అగస్త్య కళాశాలల కరస్పాండెంట్ దొడ్డిపట్ల నాగేశ్వరరావు విద్యార్థులకు స్వీట్స్ పంచారు. నగరంలోని 8, 39, 41 డివిజన్‌ల్లో హర్ ఘర్ తిరంగా యాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమంలో నాయకులు యార్లగడ్డ రామ్ కుమార్, గోడి సత్యవతి పాల్గొన్నారు.



గాంధీనగర్‌లో జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ

సీపీఐ మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కాకినాడ సిటీ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఎమ్మెల్యేలు కృషి చేయట్లేదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు అన్నారు. సోమవారం పీఆర్ భవన్‌లో సీపీఐ 28వ మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు. నిరుద్యోగం రాష్ట్రంలో తాండవం చేస్తుందన్నారు. ఉద్యోగాలు లేక పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం జరుగుతుందన్నారు. జిల్లా అభివృద్ధి జరగాలంటే నూతన పరిశ్రమలు ఏర్పాటు చేయాలని మధు కోరారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిందన్నారు. ఆనాటి నుంచి ఈ 100 సంవత్సరాల కాలంలో భారతదేశం గర్వించదగ్గ పాత్రను ఎర్రజెండా పోషించిందన్నారు. ఆనాడు ప్రైవేట్ వ్యక్తుల చేతిలో బ్యాంకులు ఉండి విపరీతమైన లూటీలు జరుగుతున్న సందర్భంలో బ్యాంకుల జాతీయ కరణ కోసం రాజాభరణాల రద్దు కోసం కమ్యూనిస్ట్ పార్టీ పోరాడి విజయాలు సాధించిందని మధు వివరించారు. కమ్యూనిస్ట్ పార్టీలో అనేక మంది త్యాగజీవులు తమ వీరత్వాన్ని, త్యాగపూరితమైనటువంటి విధానాన్ని చాటి చెప్పారన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు బోడికొండ, తోకల ప్రసాద్, పప్పు ఆదినారాయణ పాల్గొన్నారు.

కోతకు గురవుతున్న బీచ్ రోడ్డు



ప్రమాదకరంగా మారిన బీచ్‌రోడ్డు



బీచ్ రోడ్డులో గోతులు పడిన దృశ్యం

కొత్తపల్లి: ఎటువంటి తుపాన్ హెచ్చరికలు లేనప్పటికీ సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. దీంతో ఉప్పాడ- కాకినాడ బీచ్ రోడ్డు కోతకు గురవుతుంది. ఉప్పాడ శివారు ఎస్సీజీఎల్ సమీపంలో బీచ్ రోడ్డు ఒక వైపు పూర్తిగా కోతకు గురైంది. బీచ్ రోడ్డులో పెద్దపెద్ద గుంతలు పడటంతో ప్రయాణించే వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. బీచ్ రోడ్డులో రక్షణ వేసిన బండరాళ్ల గోడ సైతం కెరటాలు ఉధృతికి రోడ్డు మీద పడుతున్నాయి. కెరటాలు రోడ్డు మీదకు ఎగసి పడుతుండటంతో అటుగా వెళ్లేందుకు ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ రోడ్డులో ప్రయాణం వాహనచోదకులకు దినదినం గండంగా సాగుతోంది. కాకినాడ- ఉప్పాడ బీచ్‌రోడ్డు మృత్యు రహదారిగా మారిందని, అధికారులు స్పందించి కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాని ప్రయాణికులు కోరుతున్నారు.

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

బోట్‌క్లబ్: ప్రతి ఒక్కరూ వ్యక్తిత్వ వికాసంతో ఎంతో సాధించవచ్చని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు గంపా నాగేశ్వరరావు అన్నారు. స్థానిక హోటల్‌లో సోమవారం అనుభవజ్ఞులైన ట్రైనర్లతో వ్యక్తిత్వ వికాస నిపుణులకు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరానికి చెందిన 30 మందికి పబ్లిక్ స్పీకింగ్, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ పొందారు. పబ్లిక్ స్పీకింగ్‌లో అనేక మెళకువలు నేర్పినట్లు ఆయన తెలిపారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు, అవార్డులు అందించారు.

పిఠాపురంలో కానరాని అభివృద్ధి

- మురికి కూపంగా పట్టణంలోని వీధులు
- పడకేసిన పారిశుధ్యం
- అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ
- పంట కాలువల్లోకి మురుగు నీరు
- ఏలేరు కాలువ పొంగడంతో చెరువులను తలపిస్తున్న వీధులు



పందుల స్థావరంగా పిఠాపురంలోని ఓ కాలనీ



ఏలేరు కాలువ నీటితో జలమయమైన రజకపేట ఏరియా

పిఠాపురం: ఆధ్యాత్మిక కేంద్రమైన పిఠాపురం చిన్న చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. ఏలేరు కాలువ పొంగిన ప్రతిసారి పట్టణంలోని వీధులు చెరువులుగా మారుతున్నాయి. పారిశుధ్యం నిర్వహణకు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నా చెత్త తొలగింపు, మురికి నివారణ చర్యలు మాత్రం కానరావడం లేదు. ఇప్పటికే డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తూ నరకయాతన అనుభవిస్తున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లు జలమయంగా మారి పట్టణం అంతా మురికికూపంగా మారుతోంది. పిఠాపురం అభివృద్ధికి రూ.కోట్లు మంజూరు చేసి పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు కూటమి నేతలు ప్రకటించుకోవడం తప్ప ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన మాత్రం అందని ద్రాక్షగానే మిగులుతోంది.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ

పిఠాపురానికి అత్యంత ప్రధాన సమస్యగా ఉన్న డ్రెయినేజి వ్యవస్థను మెరుగు పర్చకపోవడంతో చినుకు పడితే చాలు పట్టణం చెరువుగా మారుతోంది. సాధారణ పరిస్థితుల్లో మురికి నీరు వెళ్లే పరిస్థితులు కనిపించడం లేదు. పట్టణంలో డ్రెయినేజీలు పూడుకుపోయి మురుగునీరు పారడం లేదు. అవుట్‌లెట్ సమస్య తీవ్రంగా ఉంది. పంట కాలువలు మురుగు డ్రెయిన్లుగా తయారయ్యాయి. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగు అవుట్ లెట్లు లేక పలు ప్రాంతాల్లో నిలిచిపోతోంది. డ్రయివర్స్ కాలనీ, సకలయ్య చెరువు, మోహన్‌నగర్, జగ్గయ్య చెరువు ప్రాంతాలు మురుగుతో దుర్గంధం వెదజల్లుతోంది. ఆ ప్రాంతంలో పిల్లలు, పెద్దలు అనారోగ్యాలకు గురవుతున్నారు. కూలీ డబ్బులు ఆస్పత్రి ఖర్చులకు సరిపోతున్నాయని వారు వాపోతున్నారు. మున్సిపాలిటీ లెక్కల ప్రకారం పట్టణంలో 32 మురికివాడలున్నాయి. 172 కిలోమీటర్ల నిడివిలో పక్కా డ్రెయిన్లు, 71 కిలో మీటర్ల పొడవున కచ్చా డ్రెయిన్లు పట్టణంలో ఉన్నట్టు అధికార లెక్కలు చెబుతున్నాయి. వీటికి కనీస మరమ్మతులు కూడా చేయడం లేదు. కచ్చా డ్రెయిన్లు పరిస్థితి దయనీయంగా ఉంది.

చినుకు పడితే చెరువులే

మురుగు కాలువల్లో పూడికను తొలగించకపోవడంతో వర్షం వస్తే రోడ్లు జలమయమవుతున్నాయి. మెయిన్‌రోడ్డులోని చర్చి సెంటర్, అంబేడ్కర్ సెంటర్, సినిమా సెంటర్, పోలీస్‌స్టేషన్ సెంటర్‌లోని కాలువల్లో మురుగు, వర్షపు నీరు చేరి ఉప్పొంగుతూ రోడ్లపైకి చేరుతోంది. శివారు ప్రాంతాల్లో మురుగు కాలువలు లేకపోవడంతో అక్కడి పరిస్థితి దయనీయంగా ఉంది. చిన్న పాటి వర్షానికి సైతం మెయిన్ రోడ్లు చెరువులుగా మారిపోతున్నాయి. ఏలేరు ఆయకట్టులోని శివారు భూములకు సాగు నీరు అందించే ప్రధాన చెరుకుల కాలువ పట్టణం మధ్యలో ఉంది. ఈ కాలువకు కరపవారి కాలువ, ఈదురు చేను కాలువతోపాటు పలు ఉప కాలువలున్నాయి. ప్రస్తుతం ప్రధాన చెరుకుల కాలువతో పాటు, ఉప కాలువ పట్టణంలో మురుగు కాలువలుగా మారాయి. ఈ పంట కాలువల్లో చెత్త పేరుకుపోయింది. డ్రెయిన్లలో పూడికతీత పనులు తూతూ మంత్రంగా చేస్తున్నారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లోని కాలువల్లోనే పూడిక పనులు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. తీసిన పూడిక మట్టిని అక్కడే వేస్తూ ఎండిన తరువాత తొలగించడం లేదు. వర్షం వస్తే తిరిగి పూడిక మట్టి కాలువల్లోకి చేరిపోతోంది.

పట్టణానికి ఏలేరు కాలువతో సమస్యలు

పిఠాపురం పట్టణం నడిబొడ్డు నుంచి వెళ్లే ఏలేరు కాలువతో ప్రజలకు పెద్ద సమస్యలు తలెత్తుతున్నాయి. ఏలేరు కాలువకు నీరు వదిలిన ప్రతి సారి కాలువలు సక్రమంగా లేక నీరు పొంగిపొర్లి ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ముఖ్యంగా మంగయ్యమ్మరావు పేట, రజకపేట తదితర ప్రాంతాలు రెండు రోజులుగా వచ్చి పడుతున్న నీటితో జలమయమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యకు పరిష్కారం చూపించాలని ప్రజలు అధికారులకు మొరపెట్టుకుంటున్నారు.



వర్షంతో జగ్గయ్య చెరువు కాలనీలో రోడ్డు దుస్థితి

ఎంపీ, ఎమ్మెల్యే ఏమయ్యారు?



> పిఠాపురం పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేస్తాం అంటే అది నమ్మి ఓట్లేసిన ప్రజలకు సంవత్సరకాలంగా ఇక్కడ నెగ్గిన ఎంపీ, ఎమ్మెల్యేలు కానరావడం లేదు. ఏడాదిగా ఏ ఒక్క అభివృద్ధి పని పట్టణ పరిధిలో చేయలేదు. పిఠాపురంలో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. ట్రాఫిక్ సమస్య గతంలో కంటే దారుణంగా మారింది. పోలీసులు అసలు ట్రాఫిక్‌ను పట్టించుకోవడం లేదు.
>
> – కొండేపూడి శంఖర్రావు, సామాజికవేత్త, పిఠాపురం

క్లుప్తంగా

అదనపు కమిషనర్‌కు పదోన్నతి

కాకినాడ సిటీ: నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కేటీ సుధాకర్‌కు పదోన్నతి లభించింది. ఆయనకు స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా ప్రమోషన్ ఇచ్చారు. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

13న సామూహిక ప్రతిజ్ఞ చేపట్టాలి

కాకినాడ సిటీ: ఈనెల 1 నుంచి 31వ తేదీ వరకూ నెల రోజులపాటు నిర్వహిస్తున్న నషా ముక్త్ భారత్ అభియాన్ చైతన్య కార్యక్రమాల్లో భాగంగా 13వ తేదీ బుధవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, యూనివర్సిటీలు, కళాశాలలు, పాఠశాలల్లో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి కార్యాలయాల అధిపతులు, ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులను కోరారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమాలను 5 నుంచి 10 ఫొటోలు చిత్రీకరించి, ఒక షార్ట్ వీడియోను అదే రోజు తప్పనిసరిగా తమకు పంపాలని కోరారు. ఉద్యోగులు, విద్యార్థులు ఎస్ఎంబీపీ వెబ్‌సైట్‌లో మాస్ ఈ-ప్లెడ్జి తప్పక చేపట్టాలని కలెక్టర్ కోరారు.

జీతాల కోసం కార్మికుల నిరసన



ఇంద్రపాలెం పంచాయతీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కాకినాడ రూరల్: మండలంలోని ఇంద్రపాలెం పంచాయతీ కార్మికులు తమకు జీతాలు తక్షణం చెల్లించాలని పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు మూడు నెలల జీతాలు చెల్లించాలని కోరుతూ నిరసనకు దిగడంతో కొద్దిసేపు పారిశుధ్య పనులు నిలిచిపోయాయి. పంచాయతీ అధికారులు వారికి నచ్చజెప్పి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. పారిశుధ్య కార్మికుల జీతాల బకాయిలపై ఈఓ పీఆర్ అండ్‌ఆర్‌డీ సీతారామాంజనేయులను వివరణ కోరగా రెండు నెలల జీతాలు చెల్లించామని, మూడు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పంచాయతీ నిధుల నుంచే సిబ్బందికి జీతాలు ఇవ్వాల్సి ఉండటంతో ఇంటి పన్నులు, ఇతర ఆదాయ వనరులను పరిశీలించి జీతాలు చెల్లింపునకు చర్యలు తీసుకుంటామన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

కాకినాడ రూరల్: రమణయ్యపేట అడబాల ట్రస్ట్ కార్యాలయంలో కోరమాండల్ మహిళా సంఘం ఆధ్వర్యంలో పేద మహిళలకు సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సంఘం ద్వారా ప్రతి నెలా పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు సంఘ అధ్యక్షురాలు గౌరీ తెలిపారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త శిరీష, సంఘ కార్యదర్శి మల్లీశ్వరి, మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

కరప: మండలంలోని పాతర్లగడ్డలో సోమవారం అయ్యల సోమయాజులు పుట్టినరోజు సందర్భంగా పేద మహిళలకు చీరలను సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు అందజేశారు. ఆయన మాట్లాడుతూ, మనిషికి ధనం, అధికారం శాశ్వతం కాదని, మానవత్వంతో సేవా కార్యక్రమాలు చేయడం వల్ల కలిగే పుణ్యమే శాశ్వతమన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కాదా సత్యనారాయణ, కాకినాడ డివిజన్ పూర్వపు ధర్మ ప్రచారక్ వీరభద్రరావు, గ్రామ మహిళా కన్వీనర్ లక్ష్మి, సహ కన్వీనర్ వేణమ్మ, పడాల తేజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సీసీటీవీ ఓనర్స్ సంఘ సమావేశం



సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

కాకినాడ సిటీ: ది కాకినాడ జిల్లా సీసీటీవీ షాపు ఓనర్స్ అండ్ టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం సోమవారం స్థానిక గాంధీభవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ భవిష్యత్ కార్యాచరణను రూపొందించినట్లు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పోతుల సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు గిరిధర్, జిల్లా ఎలక్ట్రికల్ యూనియన్ అధ్యక్షుడు కాశి, ఐటీ యూనియన్ అధ్యక్షుడు మూర్తి పాల్గొని అసోసియేషన్‌కు సంఘీభావం తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పోతుల సురేష్, ఉపాధ్యక్షుడు ఇమ్మంది నాగ సాయి దినేష్, ప్రధాన కార్యదర్శి గన్నవరపు శివమణి, సంయుక్త కార్యదర్శి వాసంశెట్టి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను తక్షణమే పరిష్కరించాలి

బోట్‌క్లబ్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో పాల్గొని ప్రజలు నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. పారిశుధ్యం, డ్రైనేజీ, రోడ్ల సమస్యకు సంబంధించిన 14 అర్జీలు రాగా.. వాటిని సంబంధింత అధికారులకు పంపారు. అర్జీలను పరిశీలించి నాణ్యమైన పరిష్కారాన్ని వారికి అందించాలని అధికారులను ఆదేశించారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): 2025–26 ప్రథమ సంవత్సరం డిగ్రీ కోర్సుల్లోని ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కందుల ఆంజనేయులు తెలిపారు. సోమవారం ఆయన కళాశాలలో మాట్లాడుతూ, ఆగస్టు 18 నుంచి రిజిస్ట్రేషన్లు మొదలవుతాయని ఇంటర్మీడియేట్ లేదా తత్సమాన కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆగస్టు 21 నుంచి 23వ తేదీ వరకూ ప్రత్యేక కేటగిరీ పత్రాల పరిశీలన, 21 నుంచి 24 వరకూ కళాశాల ఎంపికకు ఆప్షన్ల నమోదు, 25వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉందన్నారు. కళాశాలలో సహాయ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆగస్టు 27న సీట్లు కేటాయించి 28న నుంచి తరగతులు ప్రారంభిస్తారని తెలిపారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

బోట్‌క్లబ్: సేవా కార్యక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా లయన్స్ క్లబ్ సంకల్ప్ పనిచేస్తుందని లయన్స్ క్లబ్ గవర్నర్ వజ్రపు కోటేశ్వరరావు అన్నారు. స్థానిక టౌన్ హాల్‌లో సోమవారం లయన్స్ క్లబ్ సంకల్ప్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్లబ్ అధ్యక్షురాలిగా వారణాసి విజ్జి, సెక్రటరీగా ముద్దన నాగదేవి, ట్రెజరర్‌గా హరణీజామి, సభ్యులుగా సామా రాజేశ్వరి, మెట్టా రాధా సరస్వతి, పున్నమరాజు రాజేశ్వరి, లక్ష్మీ లావణ్య, సుచిత్ర ప్రమాణం చేశారు. వారు మాట్లాడుతూ, దివ్యాంగులకు వీల్‌చైర్స్ అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ వారణాసి వీరరాఘవులు, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్‌లు ఈశ్వర్‌కుమార్, బాదం బాలకృష్ణ, లింగమల్లు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సుబ్బయ్య హోటల్‌లో అనుపమ సందడి



బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): పరద సినిమా ప్రమోషన్‌లో భాగంగా కాకినాడ వచ్చిన సినీ నటి అనుపమ పరమేశ్వరన్ సోమవారం స్థానిక సుబ్బయ్య హోటల్‌లో సందడి చేశారు. ఎంతో పేరుగాంచిన సుబ్బయ్య హోటల్‌లో భోజనం చేసేందుకు రావడంతో ఆమెను చూసేందుకు అధిక సంఖ్యలో అభిమానులు హోటల్‌కు చేరుకోవడంతో ఆ ప్రాంతం సందడిగా మారింది. హోటల్ సిబ్బంది, పోలీసులు అభిమానులను కట్టడి చేసేందుకు ఇబ్బందులు పడ్డారు.

బీజేపీని గద్దె దింపాలి



సమావేశంలో ప్రతిజ్ఞ చేస్తున్న సభ్యులు

బోట్‌క్లబ్: బీజేపీ అధికారంలో ఉంటే మత ఘర్షణలు తప్పవని రాజ్యాంగ పరిరక్షణ సమితి రాష్ట్ర కో-కన్వీనర్ రమేష్ పట్నాయక్ అన్నారు. స్థానిక కచ్చేరిపేటలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో సోమవారం మేలుకో ఆంధ్రప్రదేశ్- రాజ్యాంగ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రజాసంఘాలతో సమావేశం నిర్వహించారు. జిల్లా గౌరవాధ్యక్షుడు అయితాబత్తుల రామేశ్వరరావు అధ్యక్షత వహించారు. పలువురు ప్రజాసంఘాల నాయకులు, సామాజిక వేత్తలు పాల్గొని తమ అభిప్రాయాలను తెలిపారు. రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ, రాష్ట్రంలో మూడు ప్రాంతీయ పార్టీలు బీజేపీతో కలిసి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. బీజేపీని త్వరగా అధికారం నుంచి దింపకపోతే మత ఘర్షణలు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రముఖ న్యాయవాది జవహర్ అలీ మాట్లాడుతూ, దళితులు, క్రిస్టియన్లు, ముస్లింలు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. అయితాబత్తుల రామేశ్వరరావు మాట్లాడుతూ, పార్లమెంట్‌లో తీసుకురాబోయే రాజ్యాంగ వ్యతిరేక బిల్లులను రాష్ట్రానికి చెందిన ఎంపీలు వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. బీజేపీని గద్దె దింపాలని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జిల్లాస్థాయి కమిటీ సభ్యులుగా భయ్యా కుమార్, ఓ.నూకరాజు, రవితేజ తదితరులను నియమించారు.